అవస్థల్లో అంగన్‌వాడీ కేంద్రాలు


ఉప్పునుంతల బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరి వినియోగంలో లేని అంగన్‌వాడీ కేంద్రం

- మరమ్మతు లేక శిథిలావస్థలో భవనాలు
- మౌలిక వసతులు కరువు


ఉప్పునుంతల ఎస్సీ కాలనీలో ఇరుకుగా ఉన్న గదిలో వంట చేస్తున్న అంగన్‌వాడీ ఆయా

ఉప్పునుంతల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఇబ్బందుల మధ్య కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాలకు కొన్నేళ్ల క్రితం నిర్మించిన భవనాలు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో కనీస మౌలిక వసతులు లేక కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు ఏళ్ల తరబడిగా అవస్థలు పడుతున్నారు. మండలంలోని మొత్తం 56 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 40 మెయిన్ కేంద్రాలు, 16 మినీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 24 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, ఒక కేంద్రాన్ని అద్దె భవనంలో ఉంది. మరో 31 కేంద్రాలకు ఉచితంగా సమకూర్చిన భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో 9 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల కేంద్రంతోపాటు దేవదారికుంటతండా, కాంసానిపల్లితండా, మామిళ్లపల్లి, కాంసానిపల్లిలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న ఏఓ క్వార్టర్స్‌లో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో 977 మంది ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సులోపు పిల్లలు ఉండగా, మూడు నుంచి ఆరేళ్ల వయస్సులోపు పిల్లలు 508 మంది ఉన్నారు. 182 మంది గర్భిణులు, 170 మంది బాలింతలు ఉన్నారు. వారందరికీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. దాదాపుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, బాత్‌రూంల వసతిలేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల్లో కూర్చొని తినాల్సిన పౌష్టికాహారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నారు. కేంద్రాల్లో కరెంట్ వసతి లేక ఎండాకాలంలో ఉక్కపోతతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని వసతులతో కూడిన కొత్త భవనాలను మంజూరు చేయించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు, బాత్‌రూంలు లేవు

అంగన్‌వాడీ కేంద్రం వద్ద తాగునీటి వసతి లేక ప్రతి రోజు దూరంగా ఉన్న కుళాయిల వద్ద నుంచి తెస్తున్నాను. బాత్‌రూం ఏర్పాటు కోసం గోతితీసి పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో ప్రస్తుతం గోతి మట్టితో కూడిపోయింది. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో ఫ్యాన్లు లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

– సాబేరాబేగం,
అంగన్‌వాడీ ఆయా, ఉప్పునుంతల

వసతుల కోసం ప్రతిపాదనలు

బల్మూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతలతోపాటు ఇతర మండలాలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలతోపాటు తాగునీరు తదితర వసతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. కొన్ని గ్రామాల్లో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కేంద్రాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందిగా ఉంది. కేంద్రాలకు ఇప్పటివరకు కరెంట్ వసతి లేదు. పాత భవనాల పరిస్థితులను, కరెంట్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం.

– దమయంతి,
ఐసీడీఎస్ సీడీపీఓ, బల్మూర్ ప్రాజెక్టు

లోపించిన పారిశుద్ధ్యం


తాడూరులో చెత్తతో నిండిన డ్రెయినేజీ


పొలుమూరు దళితవాడలో నిండిన డ్రెయినేజీ

తాడూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించింది. స్వచ్ఛదనం – పచ్చదనం పేరుకు మాత్రమే అధికారులు నిర్వహించారే తప్పా గ్రామాలలో పేరుకుపోయిన అపరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించలేకపోయారు. డ్రెయినేజీల్లో చెత్త నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులు గ్రామాలు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలను అధికారులు పరిష్కరించాలి



చారకొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జూపలి, చంద్రాయన్‌పల్లి, గోకారంలో సీపీఎం నాయకులు పర్యటించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు పరిశుభ్రతపై ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. మండలంలో ఎన్నో ఏళ్లుగా బీటీకి నోచుకోని రోడ్డు కురిసిన వర్షాలతో బురదమయంగా మారిందన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, ఎల్క శ్రీను, మధు, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు


కొల్లాపూర్‌లో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. నాయకులు క్యాంపు కార్యాలయంలో కేకును కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని మంత్రి తనయుడు జూపల్లి అరుణ్ సందర్శించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. అనంతరం స్థానిక గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

విరాళాల సేకరణ

నాగర్‌కర్నూల్: కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణలో భాగంగా తిమ్మాజిపేట మద్యం డిపోకు చెందిన కార్మికులు శనివారం రూ.10వేలు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజుకు అందజేశారు. శేఖర్, మధు, జీవన్ పాల్గొన్నారు.

కవికి ఘనసన్మానం

కల్వకుర్తిరూరల్: తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కవి రఘురాములు గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ ఎన్నో పుస్తకాలు ఆవిష్కరించిన తనకు దాశరథి పురస్కార అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

బస్సు సర్వీసును పొడిగించాలి

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలోని తెలకపల్లి రూట్‌లో నడుపుతున్న బస్సు సర్వీసు రూట్‌ను పొడిగించాలని గ్రామస్తులు ఆర్టీసీ డీఎం సుభాషిణికి శనివారం వినతిపత్రం అందజేశారు. కల్వకుర్తి–తెలకపల్లి రూట్‌లో నడిచే బస్సు సర్వీసును రామగిరి, దాసర్లపల్లి, మామిళ్లపల్లి, రాకొండ మీదుగా నడపాలని వారు కోరారు. రూట్‌ను పరిశీలించి సర్వీసును పొడిగించేలా చూస్తామని డీఎం వెల్లడించారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



వెల్దండలోని ప్రహరీ లేని గిరిజన బాలికల కళాశాల హాస్టల్

వెల్దండ: మండల కేంద్రంలోని గిరిజన కళాశాల బాలికల హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థినులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. హాస్టల్‌లో మొదటి సంవత్సరంలో 50 మంది, రెండో సంవత్సరంలో 32 మంది విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థులకు అనుగుణంగా వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శలు వినిపిస్తున్నాయి. వసతి గృహంలో తాగునీటికోసం విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. చుట్టు గుట్టలు, చెట్లు ఉండడంతో రాత్రి వేళలో వసతి గృహంలోకి విష పురుగులు ప్రవేశిస్తున్నాయని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో లేకపోవడంతో రాత్రివేళ ఆవరణలోకి వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి సమస్యను తీర్చాలని కోరుతున్నారు. మంచాలు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు.

ప్రహరీ లేక అవస్థలు

నాలుగు ఏళ్లుగా ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం నిర్మాణం చేపట్టినా ప్రహరీ నిర్మించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు శాపంగా మారింది. హాస్టల్ వెళ్లడానికి కనీసం దారి కూడా లేకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటిక స్థలాల నుంచి విద్యార్థులు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. దారిలేకపోవడంతో సరుకులను మోస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. నిధులు ఉన్నప్పటికి అధికారులు అప్పట్లో పనులు చేయించక నిర్లక్ష్యం వహించారని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. మండల ప్రత్యేక సమావేశంలో కళాశాలల్లో నెలకొన్న సమస్యలను చర్చించిన సమస్యలను తీర్చలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని కళాశాల హాస్టల్ నెలకొన్న సమస్యలను తీర్చాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, నాయకులు కోరుతున్నారు.

ప్రహరీ ఏర్పాటు చేయాలి



హాస్టల్ చుట్టూ వెంటనే ప్రహరీ నిర్మించాలి. రాత్రివేళల్లో బయటకు వచ్చేందుకు భయపడుతున్నాం. విషపురుగులు ప్రవేశిస్తున్నాయి. ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందో తెలియని పరిస్థితి ఉంది. హాస్టల్‌కు ఏఎన్‌ఎంలను నియమించాలి.

–పూజ, మొదటి సంవత్సరం విద్యార్థిని, వెల్దండ

నీటి సమస్య పరిష్కరించాలి



సరిపడ తాగునీరు సరఫరా కావడం లేదు. బోరు ఉన్నా భూగర్భజలం తగ్గటంతో నీటి సమస్య తలెత్తింది. సమస్యలను కనీసం హాస్టల్‌కు వెళ్లడానికి దారి కూడ లేదు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారినికి కృషి చేయాలి.

–ప్రణీత, రెండో సంవత్సరం విద్యార్థిని, వెల్దండ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గిరిజన కళాశాల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. హాస్టల్‌లో మొత్తం 82 మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రహరీ, రోడ్డు నిర్మాణానికి నివేదికలు పంపించాం. మన్ననూర్ ఏటీడీఓ పాయింట్ మంచాలు ఉన్నాయి. త్వరలో విద్యార్థినులకు అందిస్తాం. తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

– కృష్ణవేణి, హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్, వెల్దండ

రహదారిపై వరినాట్లతో నిరసన


రహదారిలో వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపుల నిలిచిన మురుగులో గ్రామస్తులు శనివారం వరినాట్లు వేసి నిరసన తెలిపారు. జాతీయ ప్రధాన రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తుంటారని, 765 జాతీయ రహదారి అయినప్పటికీ అటవీశాఖ నిబంధనల ప్రకారం రోడ్డు ఇరుకుగా ఉందన్నారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులు గుంతలు వాటిలో మురుగు చేరడంతో కనీసం ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించి సమస్య పరిస్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణ, శ్రీకాంత్, రేద్యానాయక్, నిరంజన్, కోమిటి, తులిసి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పీఏసీఎస్ ఏర్పాటుకు డిమాండ్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

చారకొండ: రైతులకు అన్ని కార్యకలాపాలు మండలంలోనే కొనసాగేలా ఉమ్మడి మండలం నుంచి విడిపోయిన గ్రామాలకు కలిపి ప్రత్యేక పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని, లేకుంటే చారకొండ పీఏసీఎస్‌లో విలీనం చేయాలని శనివారం రైతులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, సుల్తాన్‌యాదవ్, రామచంద్రి, జంగయ్య, లింగం, రైతులు ఉన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు


జెండా ఎగరవేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని యూటీఎఫ్ ఆవిర్భావం పురస్కరించుకుని శనివారం సంఘం జెండాను నాయకులు ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ సంఘం ఆవిర్భవించిన అనంతరం ఉపాధ్యాయులసంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేశామన్నారు. అధ్యాయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ సూత్రాలుగా పనిచేస్తూ హక్కులు, బాధ్యతలు నేత్రాలుగా ముందుకు నడుస్తూ ఎన్నో విజయాలు సాధించామన్నారు. రాధాకృష్ణ, లక్ష్మణమూర్తి, వెంకటేశ్వర్లు, చిన్నయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నాగర్‌కర్నూల్: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుచుకూళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాజిపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. అందేవిధంగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. త్వరలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో శనివారం గ్రామానికి చెందిన కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మించిన నాలుగు అదనపు గదుల ప్రారంభోత్సవంలో విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. తిలకించిన కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, డైరెక్టర్ నాగ్ అశ్విన్‌లు వారిని అభినందించారు. ప్రతి ఒక్కరు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు.

రామచంద్రరావు మృతికి సంతాపం

నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామచంద్రరావు మృతికి శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సుదీర్ఘ కాలం ఆఫీస్ కార్యదర్శిగా, కోశాధికారిగా పని చేశారని శనివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో శంకర్, శివశంకర్, గోపిచారి, కొత్త శేఖర్, రామస్వామి, నాగయ్య, శ్రీనివాసులు, వాడాల బాలపీరు, ప్రకాశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'పాశవిక చర్యలు ఖండిద్దాం'

అచ్చంపేట రూరల్: బంగ్లాదేశ్ దేశంలో నివసిస్తున్న మైనార్టీలైన వేలాది మంది హిందువులపై దాడులను ఖండించాలని హిందూ చైతన్య సమితి సభ్యుడు మండికారి బాలాజీ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన హిందూ చైతన్య సమితి ముఖ్య సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఆ దేశంలో రిజర్వేషన్ల పై ప్రారంభమైన రగడ ఎలాంటి సంబంధం లేనటువంటి మైనార్టీలుగా బతుకులీడుస్తున్న హిందువులపై దౌర్జన్యం చేయడం సరైంది కాదన్నారు.

రోడ్డు మధ్యలో గుంత



వెల్దండ: మండలంలోని చారకొండ–వెల్దండ ప్రధాన రహదారి బైరాపూర్ వాగు వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంత ఏర్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీ



అచ్చంపేట రూరల్: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గూడ్స్ ట్రాలీ ఆటో ఢీకొట్టిన ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం దేవరకొండకు వెళ్తుండగా పట్టణంలోని శ్యామ్స్ ఫంక్షన్‌హాలు సమీపంలో అచ్చంపేట వైపు వస్తున్న ట్రాలీ ఆటో బస్సును ఢీకొట్టింది. ఆటో ట్రాలీ పూర్తిగా దెబ్బతింది. బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతినగా ఆర్టీసీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్టీసీ డ్రైవర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో ఆదివారం విద్యుత్ ఫీడర్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కృష్ణగోపాల్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాంనగర్‌యార్డు, పాతమార్కెట్ యార్డు, రామకృష్ణ టాకీస్, పుల్లారెడ్డి హాస్పిటల్ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు విషయాన్ని గమనించాలని తెలిపారు.

గుట్కా పాకెట్లు పట్టివేత

బల్మూర్: మండలంలోని గోదల్‌లో శనివారం సాయంత్రం కిరాణా దుకాణాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. గ్రామంలోని వజ్రం, సాధిక్ తమ దుకాణాల్లో గుట్కా, ఖైనీ, పాన్ మసాల పాకెట్లు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. శనివారం పోలీసు సిబ్బందితో కలిసి రూట్ సర్వే నిర్వహించారు. వైన్స్ పరిసర ప్రాంతాల్లో మద్యం ప్రియులకు హెచ్చరించి, కేసులు నమోదు చేశారు. నిబంధనలకు లోబడి మద్యం అమ్మకాలు చేయాలని వైన్స్ నిర్వాహకులను హెచ్చరించారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడి నియామకం



వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండాకు చెందిన వడిత్యవత్ లక్ష్మణ్‌నాయక్ సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆదివాసుల దినోత్సవ సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్, ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. శనివారం మండల గిరిజన సంఘం నాయకులు, తండావాసులు ఆయనను అభినందించారు.

కమిటీ ఎన్నిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గిరిజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, పలువురు సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఎన్‌పీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దశరథం, కురుమయ్య, శ్రీశైలం, రాజాశేఖర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధించి ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌కు రానున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు గణేష్ మాదిగ వెల్లడించారు. శనివారం ఆయన పట్టణంలోని పీజీ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. వర్గీకరణ ద్వారానే మాదిగలకు, ఉపకులాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. సమావేశంలో ఆంజనేయులు, హరీష్, రాంబాబు, శ్రావణ్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి



ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లి తండాలో శనివారం ఉదయం సక్రాంనాయక్‌కు చెందిన పాడి ఆవు విద్యుత్ షాక్‌తో చనిపోయింది. వ్యవసాయ పొలంలోనే కొద్ది దూరంలో ఇతర పశువుల వద్ద ఉన్న తన లేగదూడ కోసం ఆవు ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్తూ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన చాకలి చంద్రమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. సింగిల్ విండో చైర్మన్ జంబుల ఆనంద్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు బంగారయ్య రూ.5 వేలు ఇచ్చారు.

చారకొండ: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు కుంభం పెద్దరాములు ఇటీవల కిందపడి కాలు విరిగింది. బీజేపీ మహిళా మోర్చ అధికారప్రతినిధి లావణ్య శనివారం బాధితుడిని పరామర్శించారు. శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

కల్వకుర్తిరూరల్: పంజుగుల చెందిన సరిత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు, బియ్యాన్ని సభ్యులు అందజేశారు. గణేష్, బాలరాజు, సాయిలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

నాగర్‌కర్నూల్‌రూరల్: దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్పీ రఘునాథ్‌గైక్వాడ్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు. మండలంలోని బొందలపల్లిలో మొహర్రం పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఎండీ ఖదీర్ గ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని యువతి ఫోన్ చేసి అసభ్యంగా తిట్టడమే కాక, ఇంటికి పిలిచి తీవ్రంగా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గ్రామానికి చెందిన జగదీశ్, అంజి, మస్తాన్, శ్రీకాంత్, బాబు, రాజు, కృష్ణ కర్రలతో చితకబాదారని, తాను స్పృహ కోల్పోవడంతో వదిలేసి వారి వెళ్లినట్లు బాధితుడు ఖదీర్ తెలిపారు.